# అన్ని ఊళ్ళు మనవె అందరూ మనవారె

'బామ్మా, నానోట్‌బుక్కు చూశావా?'

'నాకేం తెలుసమ్మా నీ పుస్తకాలు...'

'అది కాదు బామ్మా... మొన్న నీ రామకోటి పుస్తకాలు బైండుచేయిస్తూ నాదిఎర్రట్ట పుస్తకం బైండు చేయించాం చూడు... ఆ పుస్తకం...'

'అదా! నిన్న రాత్రి కింద పడి వుంటే, తీసి నీ అలమర్లోనే పెట్టా... అలమర్లో వున్న పుస్తకాలు కూడా వెతుక్కునేందుకు అంత బద్ధకమైతే ఎలా చెప్పు? రేపు అత్తవారింట్లో ఎలా మసలుకుంటావో యేమిటో...' నిట్టూర్పు విడిచింది బామ్మ.

'మొదలు పెట్టావూ దండకం'.

'అవునమ్మా నేనేం చెప్పినా నీకు దండకం మాదిరే కనిపిస్తుంది...'

'అమ్మా నా బ్లూకలర్ జాకెట్టు ఎక్కడ పెట్టావ్...'

మనవరాలి మేఘ గర్జనం లాంటి సవ్వడికనక వినిపించకపోతే బామ్మ మొదలు పెట్టిన దండకం అంత త్వరగా ముగిసివుండేది కాదు.

'అలా గొంతు చించుకోకపోతే, ఆ నీలం రంగు చర మడతల్లో వుందేమో చూడరాదూ...' ఇంటి పనులతో సతమతమైపోతున్న ఆ తల్లి విసుగంతా ఆమె మాటల్లో గూడు కట్టుకుంది.

'చూశానమ్మా, ఎక్కడా కనిపించలేదు...

'జాకెట్టుకేమన్నా రెక్కలు మొలిచాయా... కొంచెం నడుంవంచి చూస్తే అదే కనిపిస్తుంది...'' ఉందిలే...' నిర్లక్ష్యంగా బదులు చెప్పింది కూతురు. ఆ పొగరుబోతుతనం తల్లి సహనాన్ని పరీక్షించింది.

'ఇక్కడ కాబట్టి నువ్వాడిందాట పాడింది పాటగా సరిపోతుంది. అక్కడా యిలా ప్రవర్తించావంటే, చూసిన వాళ్ళు కింద వుమ్మెయ్యరు. నీవల్ల మాకు చీవాట్లు చెప్పుదెబ్బలు తప్పవు...'

'నువ్వూ ప్రారంభించావ్ దండకం...'

గొణుక్కుంటూ తల్లి లోపలికి వెళ్ళింది.

'నాన్నా...'

'ఏమిటమ్మా?' రెండేళ్ళ క్రితం షష్టిపూర్తి చేసుకున్న తండ్రి అచ్యుతరామయ్య ఆప్యాయంగా అడిగాడు. ఇద్దరు మగపిల్లల తర్వాత యిక సంతానం వద్దనుకున్న తర్వాత పుట్టిన ముద్దుల కుమార్తె గదా! ఇంట్లో ఆడపిల్ల నడయాడుతూ ఉంటే చూడాలని ఆయన కోరిక. ఆ చిరకాల వాంఛను తీర్చిన అబ్బురాల బిడ్డగదా మరి!

'ఇవ్వాళ మా ఫైనలియర్ వాళ్ళమంతా కలిసి పార్టీ, గ్రూప్ ఫోటో అరేంజ్ చేసుకున్నాం. అందువల్ల...'

'డబ్బు కావాలంటావ్!'

నాన్నంటే మా నాన్నే!...'

'ఎంత కావాలంటావ్?'

పెళ్ళికూతురులా ముస్తాబవుతున్న కూతురు, 'వంద చాలు నాన్నా...' అంది.

'నిన్ను పెళ్ళి కూతురులా చూడాలని వుందమ్మా... ఆ సుదినం ఎప్పుకొస్తుందో యేమిటో...' ఆమెను చూస్తూ మురిసిపోతూ అన్నాడు తండ్రి.

'నువ్వూ దండకం మొదలు పెట్టావా నాన్నా!'

'దండకం కాదు మనసులోనిమాటమ్మా యిది...'

నవ్వుతూ చెప్పకుండానే వెళ్ళిపోయింది కూతురు, మందమారుతంలా.

కూతురుని చూస్తూ ఏవేవో ఊహలు పెంచుకుంటూ సోఫాలో కూర్చున్నాడు అచ్చుతరామయ్య.

'ఒరేయ్ రామం..' అంటూ వచ్చి పక్కన కూర్చుంది తల్లి.

'ఏమిటమ్మా!' అన్నాడు యాంత్రికంగా.

'పెద్దవాడి దగ్గరి నుంచి నిన్న ఉత్తరం వచ్చింది గదా! ఏం రాశావు సమాధానం?'

'ఇంకా అమ్మాయిని కనుక్కోలేదు...'

'ఆడపిల్ల ఎప్పుడూ కావాలని చెప్పదు. దానిమాటలు బట్టి మనమే గ్రహించాలి... పైగా యీ యేడుతో చదువు పూర్తవుతుందాయె. మొన్న గుంటూరు నుంచి వచ్చిన సంబంధం, అమ్మాయి వద్దన్నదని వదిలేశావు... మంచి సంబంధం...'

'మనకిష్టమైతే సరా... చేసుకునేది అది.... యిష్టపడొద్దూ...'

'సరే, యింతకూ కోడలేం చెప్పింది ఈ సంబంధం గురించి...'

'ఏం చెపుతుంది! అసలే అది మొండి ఘటం, అమ్మాయి యిష్టానికే వదిలిపెట్టడం మంచిదంది?

'మీ రిద్దరూ యిలా కూడబలుక్కుంటే, మధ్య నేనెందుకు...''

'అది కాదమ్మా, రోజులు మారాయి గదా, అమ్మాయి యిష్టం లేకుండా పెళ్ళి చెయ్యడం మంచిది కాదు' అన్నాడు అచ్యుతరామయ్య తల్లికి నచ్చచెబుతూ.

'నేను మాత్రం ఏమన్నానని? అంతా అమ్మాయి యిష్టానికే వదలిపెట్టకుండా పెద్దవాళ్ళమైన మనం కూడా బాగోగులు విచారించాలి. అమ్మాయి సుఖంగా సంతోషంగా ఉండాలనేగా మనందరి తాపత్రయం....'

మూడు నాలుగు నెలల పాటు యింట్లో పెళ్ళి కబుర్లు తప్ప మరేమీ వినిపించలేదు. ఒక్కొక్కసారి మాటలు ప్రశాంతంగా సాగేవి. ఒక్కొక్కసారి వాతావరణం చాలా గంభీరంగా ఉండేది.

ఒక ఘట్టంలో అయితే బామ్మ విసుగుపుట్టి మనమరాలిని నిలదీసి షడిగింది. 'ఇంతకూ నువ్వు అబ్బాయిని ప్రేమిస్తున్నావా? లేకపోతే వాళ్ళ వూళ్ళో మంచి రోడ్లు, పెద్దపెద్ద భవనాలూ వున్నాయని ప్రేమిస్తున్నావా?...'

బామ్మ పూర్వకాలపుదే అయినా తన బలహీనతను పసిగట్టిందని మనమరాలు గ్రహించి సిగ్గుపడింది.

ఏ సంబంధం తెచ్చినా అందుకు కూతురు సుముఖంగా లేకపోవడంతో అచ్యుతరామయ్య విసిగిపోయాడు. కూతురంటే కొంచెం అసహ్యం కూడా కలిగింది. కాని మనస్సులోనే దాచుకున్నాడు. కొండ మీది కోతిని తెచ్చినా ఏదో ఒక లోపం కనిపిస్తూనే వుంటుంది. సర్దుకుపోయే నేర్పు వుండాలి. ఈ పిల్లకది ఎప్పుడు కలుగుతుందో, అనుకున్నాడు మనస్సులోనే పైకి చెప్పేధైర్యం లేక, చివరికి 'వరుడు కావాలి' అని పత్రికల్లో ప్రకటన కూడా ఇచ్చాడు. పల్లె, పట్టణం అనే భేదం లేకుండా చాలా ఊళ్లనుంచి ఉత్తరాలు ఫోటోలు కుప్పతెప్పలుగా వచ్చి పడ్డాయి. ఇంటిల్లిపాదికీ చేతినిండా పని.

ఎలాగయితేనేం అచ్యుతరామయ్య పిల్ల నచ్చిన మామగారయ్యాడు. అల్లుడు ఢిల్లీ నగర వాస్తవ్యుడు, విద్యాధికుడు, ఏక్షణంలోనైనా అతడు విదేశాలకు సైతం వెళ్ళవచ్చు. కూతురు కోరికలు చాలా వరకు తీరినందుకు తల్లిదండ్రులు సంతోషించారు. తలమీది బరువుని కిందికి దింపినంత అనుభూతి చెందారు.

కూతురు అత్తవారింటికి – అంటే ఢిల్లీకి వెళ్ళింది. ఆమెతో పాటు తల్లిదండ్రులు కూడ వెళ్ళి దింపి అక్కడ నాలుగైదురోజులుండి తిరిగి తమ ఊరు చేరుకున్నారు.

కొత్త పెళ్లి కూతుర్ని చూడడానికి ఎదురు ఫ్లాటు, పైఫ్లాట్లలో ఉన్న యువతులు వచ్చారు. ఆమెను మాటల్లోకి దింపారు. ఆమెకు హిందీగాని మరే ఉత్తరాది భాషగాని తెలియదు. వాళ్లకేమో తెలుసు తెలియదు. వాళ్లమధ్య ఇంగ్లీషు రాకపోకలు సాగించింది. ఎదురు ఫ్లాటులో నివసించే పంజాబీ యువతి అడిగింది. ఎర్రగా బొద్దుగా ఉంటుంది.

'మీ పేరు?'

'శ్రీవల్లి' బెదురుతూ ఆమె చెప్పింది. ఆ పేరు కొత్తగా వినిపించడంతో మళ్ళీ అడిగింది పేరు 'ఓ... సిరివాలి...' ఒత్తి ఒత్తి పలుకుతూ అంది పంజాబీ యువతి. మిగిలిన వాళ్లు కూడా అలాగే అన్నారు. తల్లితండ్రులు పెట్టిన పేరు మాయమవుతున్నందుకు విచారించి ఆమె నవ్వి ఊరుకుంది. తర్వాత వాళ్లందరి పేర్లూ అడిగి తెలుసుకుంది. అల్కా, అనీత, అమిత,

భావ్‌నా, మమ్‌తా, సుఖ్‌వతి ... తనకు సుపరిచితమైన లక్ష్మీ, కనకదుర్గ, సరస్వతి... ఏదీ వినిపించలేదు. పేర్లు వేరైనా వాళ్లందరూ స్త్రీలే! ఆ భావం బలం పుంజుకునే కొద్దీ ఆమెకు భిన్నత్వం అంత విడ్డూరంగానో వికృతంగానో కనిపించలేదు.

'మీరు ప్రతిరోజు స్నానం చెయ్యరా? స్నానం చేసినా సోప్ వాడరా? ...' అని జామపండు రంగులో వున్న పైఫ్లాటు సుందరి అడిగింది కొంటె నవ్వు నవ్వుతూ, శ్రీవల్లిది చామనచాయ. కొంచెం బాధ పడింది. 'దాక్షిణాత్యులమైన మేము సాధారణంగా కొంచెం నల్లగానే వుంటాం. ఎర్రగా వున్న వాళ్లు మాలోనూ వున్నారు'. గడుసుగానే బదులు చెప్పింది. అది వినగానే ఆ సుందరి 'సారీ మేడమ్...' అంది పశ్చాత్తాపం చెందుతూ. ఎన్నిసార్లు సారీ చెప్పిందో? 'తనది ఎర్రతోలని ఆమెకు గర్వంలే' అని గుజరాతీ యువతి నవ్వుతూ చెప్పింది. ఎరుపు నలుపులలో ఏముంది? మనస్సు అందంగా వుండాలి. అదే నిజమైన అందం – అంది శ్రీవల్లి. కరెక్ట్ అంటూ ఆమెను అందరూ సమర్థించారు. నిజం ఎవరి నోట వెలువడ్డా అది నలుగురినీ అలరిస్తుంది – అనుకుంటూ ఆమె ఉప్పొంగిపోయింది. రోజులు గడిచిపోతున్నాయి.

ఆ సాయంకాలం ఇండియాగేటుకి వెడదామనుకున్న వుత్సాహంతో శ్రీవల్లి ముస్తాబై భర్త రాక కోసం ఎదురు చూస్తోంది. మసక చీకటి పడింది. రాత్రి అయింది. భర్త రాలేదు. ఆమె ఆందోళన చెందసాగింది. కిటికీ గుండా దారివంక చూస్తోంది. బెల్లు మోగడంతో ఆదుర్దాగా తలుపు తీసింది.

'సిరివాలి... దిగులుగా వున్నారేమిటి?' ఎదురు ఫ్లాటు పంజాబీ యువతి అడిగింది.

శ్రీవల్లి చెప్పింది, భర్త యింకా రాలేదని, ఇప్పుడేం చెయ్యాలి? అన్నట్టుగా ఆమె కళ్లోలోకి చూసింది. వెంటనే ఆమె శ్రీవల్లిని వెంట బెట్టుకుని ఫోను వున్న ఒక ఫ్లాటుకి వెళ్లింది. వాళ్ళ కంపెనీ మేనేజరుతో మాట్లాడింది. మూడు నాలుగు నిమిషాలు ఆమె ముఖవళికలు బట్టి శ్రీవల్లి ధైర్యం తుచ్చుకుంది.

'సిరివాలి ... నవ్వు... ఒక్క నవ్వు...'

ఇంతకూ విషయమేమిటో త్వరగా చెప్పు అన్నట్టుగా శ్రీవల్లి ఆమె వంక చూసింది.

'మిస్టర్ మూర్తి యింకా ఒక గంటలో వచ్చేస్తారు. వాళ్ళ కంపెనీ ఫ్యాక్టరీకి వెళ్ళారని మేనేజరుగారు చెప్పారు. ఈ సంగతి మీకెలా కన్వే చెయ్యాలో తెలీక, అరగంట క్రితం ఆయన తమ అబ్బాయిని యిక్కడికి పంపారట!...

ఆ తర్వాత సిరివాలిని ఫోనుగల ఆ యింటి యజమానురాలికి పరిచయం చేస్తూ, 'ఈమధ్యనే వీళ్లిక్కడికి వచ్చారు. అంతా కొత్త, అవసరమై నప్పుడు ఫోన్ చేసుకోనివ్వండి' అంది.

సహర్షంగా అలాగే అంటూ ఆవిడ రెండు నిమిషాలు కూర్చొని వెళ్ళండి' అంది.

అంత చిన్న గదిలో ఫ్రిడ్జి, రెండు సోఫాలు, దివాన్ మొదలైనవి ఎంత చక్కగా అమర్చగలిగారో అని ఆశ్చర్యపోతూ శ్రీవల్లి గదిలోని ప్రతివస్తువునీ చూడసాగింది.

'తీసుకోండి' అంటూ ఆవిడ టీపాయ్ మీద రెండు కప్పుల వేడివేడి టీ .నంకీన్ (మిక్శ్చర్) ప్లేటు, రెండు మూడురకాల సీట్లు ఉంచింది. 'నాకు ఇడ్లీలు, దోసెలు వెయ్యడం నేర్పండి కొబ్బరి పచ్చడి ఎలా చెయ్యాలో చెప్పండి. రేపు మీయింటికి వస్తాను మా హజ్బెండ్‌కి కొబ్బరి పచ్చడంటే చాలా యిష్టం...' అంది.

ఎంత కలుపుగోలుతనం! లోలోన మెచ్చుకుంది శ్రీవల్లి. ఆవిడ చూసిన అప్యాయతకు ముగ్ధురాలయింది. నిష్కారణంగా పంజాబీ వాళ్ళనీ వాళ్ళ అలవాట్లనీ ఏవగించుకున్నందుకు సిగ్గుపడింది.

'ఏమిటాలోచిస్తున్నారు?' ఆవిడ అంది.

'మీరింత మంచివారని యిప్పుడే అర్థమయింది...' శ్రీవల్లి మాటల్లో బోళాతనం గూడుకట్టుకుంది.

'బేటీ, అందర్లోనూ వుంది మంచితనం...' అంటూ లోపలి నుంచి వచ్చింది డెబ్బయ్ దాటిన అవ్వగారు. ముఖంలో మరుగున పడుతున్న గాంభీర్యం, మాటల్లో లోపించని స్పష్టత, చేతిలో అల్లుతున్న స్వెట్టరు.

శ్రీవల్లి లేచి నమస్కరించింది అవ్వగారికి.

'కూర్చో బేటీ, మంచి చెడూ అందరిలోనూ వుంది. మంచినే మనం గ్రహించాలి. పరిచయం పెరిగేకొద్దీ సందేహాలు పోయి, నమ్మకాలు కలుగుతాయి...' స్వెట్టర్ అల్లడంలో నిమగ్నురాలయింది. అవ్వగారి మాటలు మననం చేసుకుంటూ శ్రీవల్లి యింటికి వచ్చింది. ఆశ్చర్యం! గుమ్మం దగ్గర మెట్టు మీద కన్న తండ్రి కూర్చున్నాడు! పక్కనే ఒక యువకుడు తెలుగువాడే కాబోలు - నుంచున్నాడు పక్కనే రెండు చిన్న సూట్‌కేసులు.

తండ్రిని చూడగానే ప్రాణం లేచినట్లనిపించింది శ్రీవవల్లికి. ఆయనకీ అంతే.

'అమ్మా, బామ్మా కులాసాగా వున్నారా? నీ ఆరోగ్యం ఎలా వుంది? ట్రెయిన్ పొద్దుననగా వస్తే నువ్వు యిప్పుడా వస్తున్నావ్...' ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించసాగింది.

మొట్టమొదట తలుపు తెరు లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాం...'

అప్పటికి గాని గుర్తుకి రాలేదు శ్రీవల్లికి తలుపు తాళం వేసి వెళ్ళిన సంగతి.

తలుపు తెరుస్తుంటే అడిగింది ఎదురు ఫ్లాటు పంజాబీ యువతి 'పాపా వచ్చారా?'

అవునన్నట్లుగా శ్రీవల్లి కళ్ళు సమాధానమిచ్చాయి.

'నమస్తే పాపా' అంది పంజాబీ యువతి ఆదర పూర్వకంగా, ఆయన మందహాసం చేసి లోపలకి వస్తూ 'నన్ను పాపను చేసిందేమిటి ఆ అమ్మాయి' అన్నాడు.

'అమ్మను మమ్మీ అన్నట్టుగా, నాన్నను పాపా అని పిలవడం యిక్కడి యువతరానికి అలవాటు. పెద్దవాళ్ళని కూడా పాపా అని గౌరవంగా పిలుస్తారు...'

'అది సరే... నువ్వు కులాసాగా వున్నావా? మీరిద్దరూ అన్యోన్యంగా వుంటున్నారా? ఇబ్బంది లేమీ లేవు గదా!'

ఎందులోనూ తక్కువ లేదు... ఆయన చాలా మంచివారు నాన్నా... సిగ్గుపడుతూ చెప్పింది.

'అయితే అలా రాశావేమిటి వుత్తరం?...' శ్రీవల్లి నవ్వుతూ అంది 'ఆ ఉత్తరం చూసి నువ్వు చెప్పకుండా చెయ్యకుండా బయల్దేరావన్న మాట!'

'ఆ రెండు పంక్తుల ఉత్తరం చూసి మేమంతా ఎంత భయపడి పోయామో! అల్లుడుగారు నిన్ను సరిగా చూసుకోవడం లేదేమో అని అపోహపడ్డాం... మా మనస్సులు పరిపరి విధాల పోయాయి. నాకైతే కాళ్ళూ చేతులు ఆడలేదనుకో... ఎప్పుడెప్పుడు నిన్ను చూద్దామా అనిపించింది. అన్‌రిజర్వ్‌డు కంపార్టుమెంటు ఎక్కి యిలా వచ్చేశాను. ఈ అబ్బాయి పక్కన వున్నాడు కాబట్టి సరిపోయింది..' బడిపిల్లవాడు పాఠం ఒప్పజెప్పినట్లుగా అచ్యుతరామయ్య చెప్పాడు తాము పడ్డ బాధ ఆందోళన తెలియజేస్తూ, శ్రీవల్లి పశ్చాత్తాపం చెందుతున్నట్టుగా ఆమె కళ్లు తెలియజేశాయి.

'ఇక్కడ మీరు కులాసాగా వున్నారు. అదే మాకు పదివేలు... ఆయన ముఖంలో ఎంత ప్రసన్నత! 'నన్నిక్కడ దింపి అమ్మా నువ్వు వెళ్లిపోయిన తర్వాత రెండు మూడురోజుల దాకా నా మనస్సు మనస్సులో లేదు. మీతో పాటు నేను కూడా ప్రయాణమైతే బావుండేదని తోచింది... ఆ చిరాకులో ఏదో రాశాను... పోస్ట్ చెయ్యలేదు. పొరపాటుగా ఈ మధ్య ఆయన పోస్ట్ చేసినట్టున్నారు...'

'నువ్వు నిజంగా చెప్పు ఇక్కడ హాయిగా వుందా నీకు?'

'నువ్వు నమ్మవు గాని నాన్న ఇక్కడ నాకెంతో హాయిగా వుంది. ఇక్కడి మనుషులు చాలా మంచి వాళ్ళు, ఉపకారబుద్ధి గలవాళ్ళు...' బెల్లు మోగింది.

'ఆయనే వచ్చినట్టున్నారు...'

లోపలికి వస్తూనే మామగారిని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి.

'విజయవాడలో అంతా కులాసాగా వున్నారా...' అచ్యురామయ్య బదులు చెప్పేంత లోపల, 'వచ్చిన కొత్తలో మీకు తెలీకుండా నేను మా నాన్నకు పిచ్చి ఉత్తరం ఒకటి రాశాను. అది ఈ మధ్య మీరు పోస్ట్ చేసినట్టున్నారు... గాభరాపడుతూ నాన్న వచ్చారు...' అంది శ్రీవల్లి, తప్పు చేసిన పిల్లలా.

'పోస్ట్ చెయ్యడం మరచిపోయావేమోనని పోయినవారం నిన్నడక్కుండా పోస్ట్ చేశాను...'

'అది మీ కెక్కడ కనిపించింది?'

'పాత పత్రికల్లో...'

'ఆ సంగతే నేను మరచిపోయాను...'

నవ్వులతో ఆ ఫ్లాటు నిండిపోయింది. ఆ తర్వాత ఆరు రోజులు ఆరు నిమిషాలులా గడిచిపోయాయి.

జి.టి.లో విజయవాడుకు ప్రయాణమైన అచ్యుతరామయ్య స్టేషన్ చేరుకున్నాడు. కూతురు, అల్లుడు, ఆ పంజాబీ యువతి సాగనంపడానికి స్టేషన్‌కి వచ్చారు.

ఇంకా అయిదారు నిమిషాలలో రైలు కదులుతుందనగా, 'మీ అమ్మాయి చెప్పివుంటుందనే అనుకుంటున్నాను' అన్నాడు మూర్తి మామగారిని చూసి.

నిర్ఘాంతపోతూ ఆయన అల్లుణ్ణి చూశాడు.

శ్రీవల్లి తలవంచుకుంది.

'వీలు చూసుకొని ఒక్కసారి అత్తగారిని పంపించండి వల్లికి సహాయంగా వుంటారు...'

'పాపా, మీరు దాదాజీ అవుతున్నారు...' అంది పంజాబీ యువతి.

అచ్యుతరామయ్య బండి దిగి ఒక్కసారి కూతురు వంక ప్రేమగా చూస్తూ, 'ఎంత మంచి మాట విన్నానమ్మా' అన్నాడు.

'ఇప్పుడిప్పుడే అమ్మను పంపించవద్దు. ఇక్కడ వీళ్లంతా వున్నారు. నన్ను సొంత చెల్లెలులా చూస్తున్నారు. చాలా మంచివాళ్ళు నాన్న... అవసరమనిపిస్తే నేనే ఉత్తరం రాస్తాను...'

'పోస్ట్ చెయ్యడం మాత్రం మరచిపోకు' చరక వేశాడు మూర్తి.

అచ్యుతరామయ్య నవ్వుతూ బండి ఎక్కి కూర్చున్నాడు. గార్డు ఈల వినిపించింది.

✦ ✦ ✦